


## మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆదర్శంగా నిలవాలి : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బాల్యదశ నుంచే విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాలతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దినసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో సోమవారం నిర్వహించిన 'బాలల భద్రత మత్తు పదార్థాలకు నో చెప్పండి' వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఆఫ్టర్ కేర్ పిల్లలకు అవసరమైన జనన, నివాస, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు, బ్యాంక్ పాస్ బుక్కులను మంత్రి అందజేశారు. పిల్లల్లో శారీరక దృఢత్వం కోసం స్పోర్ట్స్ కిట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, ఎస్‌సిపిసిఆర్ చైర్పర్సన్ సీత దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డికి లక్డికాపూల్‌లోని పోలీసు ప్రధాన కార్యాలయంలో టిఎన్‌జిఒ యూనియన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులు మహేష్‌భగవత్, స్వాతిలక్రా, చారుసిన్హా, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## కేంద్రానికి రూ.50వేలు జరిమానా హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆధారాలు లేకుండా ఒక రిటైర్డు ఉద్యోగిపై సీబీఐ కేసు పెట్టడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఇది రాజ్యాంగంలోని అధికరణ 21 ద్వారా వ్యక్తి లభించిన స్వేచ్ఛను కాలరాయడమేనని చెప్పింది. రిటైర్డు ఉద్యోగికి రూ.50 వేలు చెల్లించాలని కేంద్రానికి ఆదేశిస్తూ తీర్పు చెప్పింది. 2009 జనవరి 31న రిటైర్ అయిన ఉద్యోగిపై, 2009 మార్చిలో తయారైన మెడిసిన్స్ విషయంలో సీబీఐ కేసు పెట్టింది. సికింద్రాబాద్ లాలాగూడలోని రైల్వే సెంట్రల్ ఆస్పత్రికి సరఫరా చేసిన రాక్సీత్రోమైసిన్ ట్యాబ్లెట్స్‌ను2010 మేలో సీబీఐ సేకరించి పరీక్షలకు పంపింది. అవి నాణ్యత లేవని కేంద్ర ఔషధ నియంత్రణ మండలి తేల్చింది. తనపై ఉన్న ఈ కేసును కొట్టేయాలంటూ ప్రధాన నిందితుడిగా ఉన్న హిందూస్థాన్ యాంటీబయోటిక్స్ లిమిటెడ్ జోనల్ మేనేజర్‌గా చేసి రిటైర్ అయిన ఎ.కె.గుప్త పిటిషన్ వేశారు. పిటిషనర్ రిటైర్ అయ్యాక సరఫరా అయిన మందుల విషయంలో సీబీఐ కేసు పెట్టడాన్ని న్యాయమూర్తి తప్పుపట్టారు. పిటిషనర్‌పై నమోదైన కేసును రద్దు చేశారు. కోర్టు ఖర్చుల కింద రూ.50 వేలు చెల్లించాలని కేంద్రాన్ని ఆదేశించారు.

## అప్పీల్ డిస్మిస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలోని భూదాన్ భూముల్లో నిర్మాణాల కూల్చివేతలపై సింగిల్ జడ్జి ఇచ్చిన ఆర్డర్‌లో జోక్యానికి డివిజన్ బెంచ్ నిరాకరించింది. అప్పీల్‌కు విచారణార్హత లేదని చెప్పింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని పద్మ ఇతరులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం కొట్టివేసింది. కూల్చివేతల తర్వాత అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్నామని ప్రభుత్వం చెప్పింది. అన్యాయంగా ఇళ్లను కూల్చేశారని పిటిషనర్ లాయర్ వాదించారు. ఇరువర్గాల వాదనలు విన్న డివిజన్ బెంచ్, కూల్చివేతలపై ప్రధాన పిటిషన్ ఇంకా సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉందని గుర్తు చేసింది. కాబట్టి అప్పీలుకు విచారణార్హత లేదన్న రిజిస్ట్రీ అభ్యంతరాలు కరెక్టేనని చెప్పింది.

## స్వర్ణ దేవాలయాన్ని సందర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంజాబ్ రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని సోమవారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా దేశం, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోరుతూ మంత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంత్రిని సాదరంగా ఆహ్వానించి, ఆలయ విశిష్టతలు, చరిత్రను వివరించారు.అనంతరం మంత్రి లక్ష్మ ణ్ కుమార్ గురుద్వారా సంప్రదాయం ప్రకారం లంగర్ సేవలో పాల్గొని భక్తులతో కలిసి భోజనం చేశారు. స్వర్ణ దేవాలయం వంటి ఆధ్యాత్మిక కేంద్రాలు దేశ ఐక్యతకు, సాంస్కృతిక విలువల పరిరక్షణకు ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రోటోకాల్ అధికారులు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## కుటుంబంలోనే ఏకీకరణ లేని కెసిఆర్ తెలంగాణ పునరేకీకరణ ఎలా చేస్తాడు?

కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** స్వంత కుటుంబంలోనే ఏకీకరణ లేని కెసిఆర్ తెలంగాణ పునరేకీకరణ ఎలా చేస్తారని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ మేడిపల్లి సత్యం ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడుగా ఎలా ఉండకూడదో అనే చెప్పేందుకు కెసిఆర్ ఉదాహరణ అని అన్నారు. హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతులపై కెసిఆర్ ఇప్పుడు కపటప్రేమ చూపిస్తున్నారని, అధికారంలో ఉండగా ఖమ్మంలో రైతులకు బేడీలు వేసారని, వరి వేస్తే ఉరి వేసినట్లేనని బెదిరించారని అన్నారు. తమ ప్రభుత్వం ఏక కాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసిందని, వరి పండించిన వాళ్ళకి బోనస్ ఇస్తోందన్నారు. ఇక అధికారంలోకి రామని తెలిసే బిఆర్‌ఎస్ నేతలు ముఖ్యమంత్రిపై అవాకులు చెవాకులు పేలుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వంద సీట్లతో అధికారంలోకి వస్తామని చెప్పారు.

## బిసిల ఓట్లతో గెలిచి బిసిలకే అన్యాయం చేస్తున్నారు : వి.హెచ్

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** బిసిల ఓట్లతో గెలిచి బిసిలకే అన్యాయం చేస్తున్నారని కాంగ్రెస్ మాజీ ఎంపి వి.హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనగణనలో కులగణన లేకపోవడం తీవ్ర అభ్యంతరకరం వ్యక్తం చేశారు. కులగణన లేకుంటే జనగణన ఎందుకని, కులగణనలో ఒబిసి కాలమ్ ఉండాల్సిందేనని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే అందరి లెక్కలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎవరైనా గెలిచేది బిసిల ఓట్లతోనే అని గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయాల్లో కేవలం అగ్రకులాలే పెరుగుతున్నారని, బిసి లెక్క తెలియకపోతే వారు రాజకీయాల్లో ఎలా పెరుగుతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడూ ఎదురు తిరగకపోతే బిసిల పరిస్థితి 100 ఏళ్లైనా ఇంతేనని, దీనిపై ఉద్యమించాలని బిసి సంఘాలకు హనుమంతరావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాదయాత్ర చేసిన సందర్భంగా బిసిలకు జరుగుతున్నఅన్యాయం అర్థమైందన్నారు.

# మహిళల భద్రతే అభివృద్ధికి పునాది

సిఎం రేవంత్ రెడ్డి డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్.. సమాజ బాధ్యతగా అరికట్టాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళలు, పిల్లలకు భద్రత కల్పించినప్పుడే రాష్ట్రం వేగంగా అభివృద్ధి సాధిస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ పోలీసులు కొత్తగా ప్రవేశపెట్టిన 'స్పదన' తక్షణ రక్షణ బృందాలను బంజారాహిల్స్‌లోని ఐసిసిసి కార్యాలయంలో సిఎం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, ఎంపిలు వేం నరేందర్‌రెడ్డి, ఎం.అనీల్ కుమార్ యాదవ్, డిజిపి బి.శివధర్‌రెడ్డి, పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణ, సాధికారత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళల భద్రతను ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకుంటాయని, అదే మార్గాన్ని తెలంగాణ అనుసరిస్తోందన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం షీ టీమ్స్‌ను బలోపేతం చేసినట్లు తెలిపారు. ప్రమాదంలో ఉన్న మహిళలకు అండగా నిలిచేలా స్టాండ్ విత్ హర్ కార్యక్రమం అమలు చేస్తున్నామని, స్పందన ద్వారా 24 గంటలు సహాయం అందిస్తున్నామని వివరించారు. సమస్య వచ్చిన తర్వాత పరిష్కారం కాదు, సమస్యనే రాకుండా చూడడం సమాజ బాధ్యత అని సిఎం అన్నారు. డ్రగ్స్ వ్యసనం సమాజానికి పెద్ద ముప్పుగా మారుతోందని సిఎం హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాల కారణంగా మహిళలు, పిల్లలపై నేరాలు పెరుగుతున్నాయని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి డ్రగ్స్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఎంత పెద్దవారైనా, ప్రజాప్రతినిధులైనా వదిలిపెట్టకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పీస్ కమిటీలు డ్రగ్స్ నియంత్రణలో కీలక పాత్ర పోషించాలని, పాఠశాలల స్థాయి నుంచే అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు ఎం.శ్రీనివాసులు, తఫ్సీర్ ఇక్బాల్, జోయల్ డేవిస్, ఎన్.శ్వేత, డాక్టర్ లావణ్యలతో పాలు తదితరులు పాల్గొన్నారు.

**మెడికల్ టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం**

హైదరాబాద్‌లో మెడికల్ టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న హెల్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు సిఎం పిలుపునిచ్చారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, పెట్టుబడులకు భద్రత కల్పిస్తుందన్నారు. గచ్చిబౌలిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో సోమవారం అపోలో ఆసుప్రతి ఏర్పాటు చేసిన 'ది హాస్పిటల్ ఆఫ్ గ్రాటిట్యూడ్'ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే విదేశీయుల కోసం మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి డైరెక్ట్‌గా విమానాలు హైదరాబాద్ వచ్చేలా కేంద్రాన్ని కోరామని చెప్పారు. అంతర్జాతీయ గ్రీన్ ఛానల్ ద్వారా ఆస్పత్రులకు పేషెంట్లను తీసుకువచ్చేలా ఎయిర్ పోర్టు అథారిటీతో మాట్లాడుతున్నామని సిఎం వెల్లడించారు. అపోలో హాస్పిటల్స్ యాజమాన్యం46 ఏళ్ల కింద చెన్నైలో అపోలో మొదటి ఆస్పత్రి ని ప్రారంభించి దేశంలో అనేక ఆస్పత్రుల ప్రారంభానికి మార్గదర్శి అయ్యారన్నారు. అపోలో అనే పదం కోట్లాది మంది ప్రజల గుండె ధైర్యమని, సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఆపోలో యాజమాన్యాన్ని సిఎం అభినందించారు.

## కాళేశ్వరంపై విచారణ చేపట్టాలని సిబిఐకి లేఖ : సిఎం రేంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యాయ నిపుణుల సూచనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై తక్షణమే విచారణ చేపట్టాలని కోరుతూ సిబిఐకి లేఖ రాయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. అవసరమైతే సిబిఐ డైరెక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకుని, నేరుగా కలిసి వినతి పత్రం సమర్పించాలని మంత్రులకు సూచించారు. కాళేశ్వరంపై ఇటీవల హైకోర్టు తీర్పు నేపథ్యంలో తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వీతో చర్చించి ప్రభుత్వం అనుసరించాల్సిన కార్యాచరణ ప్రణాళికను నిర్దేశించారు.

కాళేశ్వరంపై పిసి ఘోష్ కమిషన్ ఏర్పాటును, కమిషన్ ఇచ్చిన నివేదికను హైకోర్టు తప్పు పట్టలేదని, అవన్నీ చెల్లుబాటులో ఉన్నాయని న్యాయ నిపుణులు సిఎంకు వివరించారు. కాళేశ్వరం అంశంపై ప్రస్తుతం ఏ కోర్టులోనూ ఎలాంటి కేసు పెండింగ్‌లో లేదని, అందువల్ల సిబిఐ విచారణ చేపట్టేందుకు చట్టపరమైన అడ్డంకులు లేవని అభిప్రాయపడ్డారు. దీంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ పై సిబిఐ విచారణ చేపట్టేలా ఒత్తిడి పెంచాలని సిఎం ఆదేశించారు. సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వీ, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొనగా రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, సిఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఇరిగేషన్ ఈఎన్‌సి శ్రీధర్, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## ప్రభుత్వ పరిశీలనలో ఎక్స్ సర్వీస్‌మెన్ కార్పొరేషన్

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ సైనికుల సంక్షేమం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగానే 'తెలంగాణ ఎక్స్ సర్వీస్ మెన్ కార్పొరేషన్' ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్ పేర్కొన్నారు. పంజాగుట్టలో ఉన్న సైనిక్ వెల్ఫేర్ విభాగం ప్రధాన కార్యాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. కార్యాలయంలో ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ ప్రణాళికల పై, కొత్త డైరెక్టర్ బ్రిగ్ ఎఆర్ రావు బృందం ఈ సందర్భంగా సివి ఆనంద్‌కు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.మన సైనికులు వెబ్‌సైట్‌లో సుమారు 40,000 మంది మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు నమోదయ్యాయని,రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం నుండి నగదు గ్రాంట్లు మాత్రమే కాకుండా, గృహ నిర్మాణం, విద్య, ఉపాధి వంటి అనేక సంక్షేమ పథకాలు వీరికి అందుబాటు లో ఉన్నాయని ఆనంద్ వివరించారు.ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వంతో బోర్డు సభ్యులు సరైన సమన్వయం చేసుకోక పోవడం వల్ల వాటిలో చాలా అమలు కావడం లేదనీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మాజీ సైనికుల సంక్షేమానికి ఫ్లాగ్ డే నిధి, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే వార్షిక బడ్జెట్ ప్రధాన వనరులని,మహారాష్ట్ర,ఇతర రాష్ట్రాలలో ఉన్న విధంగా టెస్కో లేదా తెలంగాణ ఎక్స్‌సర్వీస్ మెన్ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వంలో ఒక ప్రతిపాదన పెండింగ్‌లో ఉందని ఆయన వివరించారు. దీని ద్వారా మాజీ సైనికులకు ఎస్కార్ట్స్ , సెక్యూరిటీ గార్డులుగా పెద్ద ఎత్తున ఉపాధి కల్పించవచ్చు అని సివి ఆనంద్ స్పష్టం చేశారు.

## భూపోరాటాల యోధుడు దాసరి నాగభూషణరావు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూములేని నిరుపేదలకు భూపంపిణి కోసం అనేక భూపోరాటాలు చేసిన యోధుడు దాసరి నాగభూషణరావు అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ కొనియాడారు. సిపిఐ ఉమ్మడి ఎపి మాజీ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు దాసరి నాగభూషణ రావు 18వ వర్ధంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో సోమవారం ఈ.టి. నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్య నాయక్, తదితరులు దాసరి నాగభూషణ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ మాట్లాడుతూ మార్క్సిజం పట్ల ఆకర్షితులై విప్లవ రాజకీయాలకు, భూపోరాటాలకు దాసరి నాగభూషణ రావు తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. అనగారినవర్గాల అభ్యున్నతికి, కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారన్నారు. అయన ఆశయ సాధనను ముందు తీసుకువెళ్లేందకు కృషి చేస్తామని చెప్పారు. నేటి యువత ఆయన బాటలో నడవాలని ఈ.టి. నరసింహ కోరారు. ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు కె.స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మి నారాయణ, సిపిఐ నేతలు చైతన్య యాదవ్, బోయ శ్రీరాములు, బోడ అంజయ్య తదితరులు దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**సిఆర్ ఫౌండేషన్‌లో...**

**శేరిలింగంపల్లి :** సిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు దాసరి నాగభూషణరావు 18వ వర్ధంతి వేడుకలను కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్ కుమార్, కోశాధికారి, వృద్ధాశ్రమం డైరెక్టర్ వి.చెన్నకేశవ రావు, సిఆర ఫౌండేషన్ పాలీక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె. రజనీ, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ శ్రీమతి జోస్యభట్ల కల్పన లు విచ్చేసి నాగాభూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజాలి ఘటించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ దాసరి నాగభూషణం తన తుది శ్వాస వరకు ప్రజా అభ్యున్నతికి సిఆర్ ఫౌండేషన్ స్థాపనలో చేసిన కృషిని, ఆయన త్యాగనిరతిని గుర్తు చేసుకొని ఆయన సేవలను కొనియాడారు. దాసరి నాగభూషణం రాజ్యసభ సభ్యులుగా ఉన్న కాలంలో ఆయన వద్ద పి.ఎ గా పని చేసిన వృద్ధాశ్రమ వాసి యెలినేని సత్యనారాయణ మాట్లాడుతూ దాసరి నాగభూషణం పట్టుదల, రిబద్ధత సిఆర్ ఫౌండేషన్ స్థాపనలో ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు యస్. రాజేంద్ర రావు, వృద్ధాశ్రమం హోమ్ మేనేజర్ శ్రీనివాస్, మల్లపాటి వెంకటేశ్వరరావు, ఇందుకూరి అరుణ కుమారి, వెలువోలు సాంబశివరావు, మహిళాసంక్షేమ కేంద్రం కమిటీ సభ్యులు వి. లలిత,పాధ్యాయినీలు, వృద్ధాశ్రమ వాసులు , తదితరులు దాసరి నాగభూషణం చిత్రపటానికి పుష్పంజాలి ఘటించి నివాళులు అర్పించారు.

### నారాయణ ఇంజనీరింగ్ కళాశాలకు..

## ఎంబిఎ విభాగానికి అంతర్జాతీయ గుర్తింపు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్) ఎంబిఏ విభాగం మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. ప్రముఖ అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ 'హైమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' నుండి ఈ విభాగానికి ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికేషన్, అకాడమిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైమ్ సంస్థ ప్రతినిధి శివయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి ప్రతిష్టాత్మక గుర్తింపు పొందిన అతికొద్ది విద్యా సంస్థల్లో నారాయణ కళాశాల ఒకటి అని తెలిపారు. విద్యా నాణ్యత, పరిపాలనా సామర్థ్యం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో కళాశాల కనబరిచిన ప్రతిభకుగానూ ఈ సర్టిఫికేషన్ అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు.

**యాజమాన్యం ప్రతినిధుల స్పందన..**

కళాశాల డైరెక్టర్ డా. వి.దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థలు ఎల్లప్పుడూ నాణ్యమైన విద్యా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇస్తాయని, ఈ ఐఎస్‌ఓ గుర్తింపు కళాశాల ప్రతిష్ఠను పెంచడమే కాకుండా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పిస్తుందన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రవి ప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది సామూహిక కృషి ఫలితంగానే ఈ గౌరవం దక్కిందన్నారు. ఆధునిక బోధనా విధానాలు, ఇండస్ట్రీ కనెక్ట్ కార్యక్రమాలే తమ ప్రత్యేకత అని తెలిపారు. ఎంబిఏ డీన్ డాక్టర్ గంగినేని ధనంజయ మాట్లాడుతూ ఎంబిఏ విభాగం విద్యార్థుల కోసం ఎక్సెల్, పవర్ బిఐ, సీక్వెల్, పైథాన్ వంటి అడ్వాన్స్ టెక్నాలజీ ప్రోగ్రామ్స్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. మేనేజ్‌మెంట్ ప్రతినిధి వై. వినయ్ కుమార్ మాట్లాడుతూ ఈ విజయం నారాయణ కుటుంబానికి గర్వకారణమని, భవిష్యత్తులో విద్యార్థులకు మరిన్ని అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంబిఏ విభాగాధిపతి డాక్టర్ జి. మాల్యాద్రి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## పోలీసులకు శుభవార్త

బర్త్‌డే, మ్యారేజి డేలకు సెలవులు: డిజిపి శివధర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పోలీసులకు ఇది శుభవార్త. పోలీసు ఉద్యోగులకు వారి పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సం రోజున ప్రత్యేక సెలవు మంజూరు చేస్తూ డిజిపి బి.శివధర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు శివధర్‌రెడ్డి వెల్లడించారు. ప్రతి రోజు పనిఒత్తిడిలో ఉన్న వీరికి ఈ ప్రత్యేక దినాలలో వారు తమ కుటుంబ సభ్యులతో గడిపేందుకు కలిసి వస్తుందన్నారు. పోలీసులు విధుల్లో తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తూ వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించలేకపోతున్నారని గుర్తించి, వారి మానసిక ఉల్లాసం, కుటుంబ బంధాలు బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో ముఖ్యమైన సందర్భాలను ఆనందంగా గడిపే అవకాశాన్ని కల్పించడమే లక్ష్యమన్నారు. అత్యవసర పరిస్థితులు మినహా అన్ని యూనిట్ అధికారులు సంబంధిత సిబ్బందికి సెలవులు మంజూరు చేయాలని ఆదేశించారు. సరైన ఆధారాలు, ముందస్తు దరఖాస్తు ఆధారంగా ఈ సెలవులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. డిజిపి తీసుకున్న ఈ నిర్ణయంపై పోలీసు సిబ్బందిలో ఆనందం వ్యక్తమవుతోంది.

## ఆర్థిక క్రమశిక్షణపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్

పెన్షన్, జిపిఎఫ్ నిర్వహణపై అధికారులకు అవగాహన




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ విభాగాల్లో ఆర్థిక పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు అకౌంట్స్ ఆడిట్, పెన్షన్ జిపిఎఫ్ అంశంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించారు. ఆదర్శనగర్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ , విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా నిర్వహించాయి.ఈ వర్క్‌షాప్‌లో ఆర్థిక క్రమశిక్షణ, ఆడిట్ నిబంధనల అమలు, పెన్షన్ విధానాలు, జిపిఎఫ్ నిర్వహణపై అధికారులకు విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాల్లో పారదర్శకతను పెంచడం, ఫీల్డ్ స్థాయి అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపడం పై ప్రత్యేకంగా చర్చించారు. అకౌంటెంట్ జనరల్ కార్యాలయ నిపుణులు తాజా ఆర్థిక నిబంధనలు, విధాన మార్పులపై వివరణాత్మకంగా సూచనలు ఇచ్చారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విభాగాల మధ్య సమన్వయం మెరుగుపడటంతో పాటు ఆర్థిక పాలనలో సామర్థ్యం పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్, ఆడిట్ విభాగ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ మాధవి, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ నరేష్ కుమార్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ అభయ్ సోనార్కర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలో పటిష్టమైన ఆడిట్ వ్యవస్థ, సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణకు ప్రభుత్వం కట్టుబడి ఉంద వారన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్, డైరెక్టర్ ఎ.ఆర్. శ్రీనివాస్, డిఐజి అభిషేక్ మహంతి, ఎస్‌పి బాలస్వామి, ఫైర్ సర్వీసెస్ డీజీ విక్రమ్ సింగ్ మాన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




## జీబ్రా సిగ్నల్ ఏర్పాటుకు వినతి

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మయంసిన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ స్థానిక సమస్యలను సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ వివరించారు. మూసాపేట్ సర్కిల్ పరిధిలోని ఇంద్రానగర్, శ్రీశ్రీ నగర్, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లో రహదారి దాటడం ప్రజలకు తీవ్ర ప్రమాదంగా మారిందని,. రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టి రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంద్రానగర్ ప్రధాన రహదారిపై జీబ్రా సిగ్నల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రశాంతినగర్ పరిశ్రమల ప్రాంతంలో పని చేస్తున్న వందలాది కార్మికులు రహదారి రాటడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది ప్రమాదాలకు దారితీస్తోందని తెలిపారు. ఈ సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, సమస్యను పరిష్కరిస్తామని సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.మనోచారి, గంగన్న, దావీద్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలను పరిష్కరించండి..

### ప్రజావాణిలో సిపిఐ నాయకుడు సదానందం వినతి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** చింతల్ సర్కిల్‌లోని రోడమేస్త్రీ డివిజన్ పరిధిలోని లెనిన్‌నగర్ సీ బ్లాక్‌లో డ్రైనేజీ లైన్ పరిష్కారానికి, అలాగే హైమాస్ట్ లైట్ కావాలని కోరుతూ సోమవారం మున్సిపల్, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సిపిఐ నాయకుడు సదానందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేనిన్ నగర్ సి బ్లాక్‌లోని చౌరస్తా వద్ద వీధి దీపాలు లేకపోవడం వల్ల రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇదే విషయంపై గతంలో కూడా వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్థలాన్ని పరిశీలించి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్ట్రీట్ నంబర్ 7లో డ్రైనేజీ లైన్ పాతదై తరచూ పొంగిపొర్లుతుందని, కొత్త డ్రైనేజీ లైన్ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబ్, రాజు చిన్నారి, అనిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

**గిరినగర్ బస్తీలో బోర్ బావి మోటార్ మరమ్మతుకు వినతి**

283 గిరినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్ బస్తీలో పోచమ్మగుడి ఎదురుగా ఉన్న విద్యుత్ బోర్ బావి సబ్‌మర్సిబుల్ మోటార్ గత కొంతకాలంగా పాడైపోయి ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోయినట్లు స్థానికులు తెలిపారు. మోటార్‌ను మరమ్మతుల కోసం తీసుకెళ్లి చాలా రోజులైనా తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో ఈ ఎండాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, సబ్‌మర్సిబుల్ మోటార్‌ను మరమ్మతులు చేసి తిరిగి అమర్చి ప్రజలకు నీటి సరఫరా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజావాణిలో సోమవారం సిపిఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ కౌన్సిలర్ వి.చంద్రమ్మ, మాజీ కౌన్సిలర్ పి.నర్సయ్య, సిపిఐ శాఖ కార్యదర్శి ఎండి యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హకీంపేటలోని ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు రాష్ట్ర జోన్1కి చెందిన ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కొమరం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల నుండి 54మంది బాలికలతో సహా 106 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారందరికి ప్రవేశాల ఎంపికల్లో భాగంగా వైద్యులచే ఆరోగ్య పరీక్షలతో పాటు వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటి, మెడిసిన్ బాల్ త్రో, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 30 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల రన్నింగ్ లాంటి శారీరక పరీక్షలు పారదర్శకంగా నిర్వహించారు. ఈ ప్రక్రియలో తెలంగాణా స్పోర్ట్స్ అథారిటి డిప్యూటి డైరెక్టర్ రవీందర్, స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్డీ మమతలు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ వెంకన్నను దర్శించుకున్న రాములుగౌడ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరం తాండాలోని శ్రీ బాలాజి వెంకటేశ్వరస్వామిని మూడుచింతలపల్లి సిపిఐ మున్సిపల్ కార్యదర్శి తప్పెట్ల రాములుగౌడ్ సోమవారం దర్శించుకున్నారు. శ్రీ బాలాజి వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా రెండవ రోజు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

# బాలల హక్కులు, చట్టాల పట్ల సమగ్ర అవగాహనకు ప్రచారం

### కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** బాలల హక్కులు, చట్టాలపై సమగ్రంగా అవగాహన కల్పించే లక్ష్యంగా జిల్లాలో గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కల్సి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, అక్రమ దత్తతలు, బాలలపై లైంగిక వేధింపులు, చట్టాల విషయంలో ప్రచారం చేస్తూ అవసరమైన సందర్భాల్లో 1098 ద్వారా సమాచారాన్ని చేరవేసి సాయం తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండే విధంగా వాటి వల్ల జరిగే నష్టాలను వివరించాలన్నారు. జిల్లాలో 67 చైల్డ్ కేర్ సంస్థల్లో 1800 మంది పిల్లలు ఉన్నారని, వీరిలో అనాథ పిల్లలకు జనన, కుల, సదరన్ ధృవీకరణ పత్రాల జారీ, ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శారద, జిల్లా వైద్యారోగ్య, విద్యా, కార్మిక శాఖాధికారులు, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ తిరుమలదేవి, సిడబ్ల్యూసి సభ్యుడు రాంమోహన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్, రహీం, తదితరులు పాల్గొన్నారు.

**డీజిల్, పెట్రోల్ కొరత లేదు :** జిల్లాలో ఎలాంటి డీజిల్, పెట్రోల్ కొరత లేదని, ఈ విషయంలో వస్తున్న సోషల్ మీడియా దుష్ప్రచాలను చూసి వాహనదారులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎనర్జీ కమిటి సమావేశం నిర్వహించి ఇంధన సరఫరా అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ జిల్లాలోని అన్ని పెట్రోల్ పంపుల్లోనూ అవసరమైన మేరకు డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉన్నాయన్నారు. పెట్రోల్ పంపు యజమానులు ఎప్పటికప్పుడు తమకు అవసరమైన మేరకు డీజిల్, పెట్రోల్ స్టాక్‌ను ఆయిల్ సంస్థల నుండి తెప్పించుకోవాలని సూచించారు. జిల్లా ఎనర్జీ కమిటి సభ్యులు, డిసిఎస్ఓ, డిపిఆర్ఓ, ఆయిల్ సంస్థ ప్రతినిధులు, పెట్రోల్ పంపు అసోసియేషన్ సభ్యు లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**ప్రజావాణిలో 89 అర్జీలు**

కిందిస్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 89 అర్జీలను దఖాస్తుదారులు సమర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ చంద్రావతి, ఇతర జిల్లా స్థా యి ప్రభుత్వ కార్యాలయాధికారులతోకల్సి ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్ కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించలేని పక్షంలో దానికి కారణాలను సైతం దరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.

**విద్యార్థి సమస్యలపై బిఆర్‌ఎస్వీ దాఖలు చేసిన అర్జీ**

రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్‌ఎస్వీ చేపట్టిన పోరుబాటలో భాగంగా తెలంగాణా రాష్ట్ర విద్యార్థి ప్రధాన కార్యదర్శి యశ్వంత్, జిల్లా కోఆర్డినేటర్ నర్సింగ్, కొర్ర ప్రవీణ్ నాయక్, రాజు యాదవ్, మనీషా, రవి కిరణ్ తదితరులు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు బకాయిలు సకాలంలో ప్రభు త్వం కాలేజీలకు చెల్లించక పోవటం వల్ల విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారని, రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించటంతో పాటు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.



## పార్కు స్థలం కాపాడిన డిప్యూటీ కమిషనర్

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బోరంపేట సింహపురి కాలనీలోని పార్కు స్థలం కబ్జాల కు గురవడంతో ప్రజాపక్షం దినపత్రికలో పార్కు స్థలం కబ్జాపై చర్యలకు డిమాండ్ అనే వార్త కథనం రావడం తో అధికారులు పార్కును కాపాడారు

ప్రజాపక్షం ఎఫెక్ట్

సర్వే నంబర్. 448 డి.బ్లాక్ లోని 500 గజాల పార్కు స్థలం తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి సూచిక బోర్డులు తొలగించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో దుండిగల్ సర్కిల్ అధికారులు సోమవారం చర్యలకు శ్రీకారం చుట్టారు. దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఎన్.వెంకటేశ్వర్ నాయక్ ఆదేశానుసారంగా ఎసిపి శ్రీనివాసు ఆధ్వర్యం లో పార్కు స్థలంలోని నిర్మాణాలను జెసిబి సహాయంతో కూల్చివేతలు చేశారు. పార్క్, ప్రజా ప్రయోజన స్థలాలు కబ్జాలకు పాల్పడితే సహించబోమని అన్నారు. అదే విధంగా దుండిగల్ సర్కిల్ పరిధిలోనీ సింహపురి కాలనీ, మల్లంపేట్, కెవిఆర్ తదితర ప్రాంతాలలో ఇటీవలే కబ్జాలకు గురైన పార్కు స్థలాలను సైతం ఉన్నత అధికారులు కాపాడి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని ప్రజలు అంటున్నారు.



## పిల్లలను డ్రగ్స్‌కు దూరంగా ఉంచుదాం

**ప్రజాపక్షం/ఉప్పల్ :** పిల్లల భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే వారిని మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచడం అత్యంత అవసరమని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తల్లిదండ్రులకు సూచించారు. డ్రగ్స్‌కు నో చెప్పి పిల్లల్ని కాపాడి, భవిష్యత్తు ను రక్షిద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం రామంతాపూర్‌లోని డాన్ బోస్కో నవజీవన్ కేంద్రంలో సే నో టు డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా సంక్షేమ అధికారి శారద, ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ కీసర డివిజన్ సత్యవతి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం చేసిన ఇద్దరు అరెస్టు...రిమాండ్



**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఇటీవల నయీం అనుచరుడు పాశం శ్రీనివాస్‌పై హత్యాయత్నం చేసిన ఇద్దరు నిందితులను కుషాయిగూడ పోలీసులు అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాశం శ్రీనివాస్(53)పై గత మూడు రోజుల క్రితం రాధిక చౌరస్తా స్వాగత్ గ్రాండ్ హోటల్ లో హత్యాయత్నం చేసేందుకు వచ్చి ప్రయత్నం విఫలం కావడంతో కత్తులను వదిలి పారిపోయారు.

ఆదివారం భువనగిరిలో ఖాజా తన డ్రైవర్ అజ్మద్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు,కారును స్వాధీనం చేసుకుని మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చి రిమాండ్‌కు తరలించారని వారు తెలిపారు.

# డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన సదస్సులు

### కలెక్టర్ దీపక్ తివాక్




**ప్రజాపక్షం/వికారాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 27నుండి మే 2వరకు బాలల భద్రత, రక్షణ, డ్రగ్స్ రహిత సమాజంపై అనే కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయని జిల్లా కలెక్టర్ దిపక్ తివారి అన్నారు. ఈ కార్యక్రమాల అమలు పై సోమవారం కలెక్టర్ విడియో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో మాట్లాడారు. జిల్లాలో బాలల భద్రత డ్రగ్స్ రహిత సమాజపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నా రు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం గూర్చి పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 27నుండి మే 2వరకు నిర్వహించే సదస్సులలో బాలల భద్రత, రక్షణ, డ్రగ్స్ రహిత సమాజం అనే అశంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనార్థాల గురించి వివరించాలని సూచించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రోత్సహించడం, డ్రగ్స్ అమ్మకాలను అరికట్టేందుకు ప్రభుత్వ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. బాలల భద్రత ఫోక్సో చట్టం, గుడ్ టచ్..బ్యాడ్ టచ్ సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రతలు, బాల్యవివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలోని విద్యాసంస్థలలో సమర్థవంతంగా అమలు చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఉపాధ్యాయులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, స్థానిక పోలీసు అధికారు లు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి రాము నాయక్, ట్రేని కలెక్టర్, సిపిఓ వెంకటేశ్వరులు, డిఆర్‌డిఏ శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాణికి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 145 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకు న్న వచ్చిన సమస్యల సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ప్రజావాణిపై నమ్మకంతో దరఖాస్తులు చేసుకుంటారని, అట్టి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ ప్రజావాణిలో జిల్లా స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తాం

### అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమరం శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అలియాబాద్ మున్సిపాలిటిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులను కల్పిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ కమరం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటిలోని మజీద్‌పూర్‌లో 10,11 వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మజీద్‌పూర్‌లోని రెండు వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయుటకు మున్సిపల్ నిధులతో భూమిపూజ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్‌లు వనజ అశోక్‌రెడ్డి, సామల జశ్వంత్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, ఎఇ సనా, మాజీ సర్పంచ్ ఎల్ల మల్లేష్, బిసి సెల్ అధ్యక్షుడు నర్సింగరావుగౌడ్, నాటకారి వెంకటయ్య, నాయకులు భాస్కర్ గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ చక్రీ విద్యానికేతన్‌లో "మీట్ ద సైంటిస్ట్" కార్యక్రమం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చక్రీపురం శ్రీ చక్రీ విద్యానికేతన్ హైస్కూల్‌లో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో 'మీట్ ద సైంటిస్ట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ శాస్త్రవేత్త కర్రె మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలో శాస్త్రవేత్తల పాత్ర అత్యంత కీలకమైందని కొత్త విషయాలు కనుగొనడమే కాకుండా ఆవిష్కరణలు సమస్త మానవాళికి ఉపయోగకరంగా ఉందని అన్నారు. సైన్స్ పట్ల ఉన్న అపోహలను తొలగిస్తూ, పరిశోధన పట్ల విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కోశాధికారి పి. నాగరాజు, సీనియర్ నాయకులు శేషగిరిరావు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమిత్రల పోస్టులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** సనత్‌నగర్‌లో ప్రారంభమయ్యే టిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ విధానంలో 34 ఆరోగ్యమిత్రల పోస్టుల భర్తీ చేసేందుకు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఉమాగౌరి పేర్కొన్నారు. డిగ్రీతో పాటు డిసిఏ పూర్తి చేసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లావాసులైన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని, 2 ఏళ్ల అనుభవం కల్గి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://medchalmalkajgiri. telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ధరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని సంబంధించిన ధృవపత్రాలతో పాటు 500 రూపాయల డిడిని జతపరిచి జిల్లా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో గడువు తేదీలోగా ప్రతి రోజు ఉదయం 11 నుండి సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలని తెలిపారు.

## పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటా



**ప్రజాపక్షం/చర్లపల్లి:** పారిశ్రామిక ప్రగతి కోసం పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన వెక్టర్ ఇంజనీర్స్ ఎలక్ట్రికల్ వ స్తూ ప్రదర్శనను చర్లపల్లి ఐలా చైర్మన్ గోవిందరెడ్డి సిఐఏ అధ్యక్షు లు డి. శ్రీనివాస్‌రెడ్డిలతో కలసి ప్రారంభించారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఎలక్ట్రికల్ వస్తూ ప్రదర్శన ఏర్పా టు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఎలక్ట్రికల్ రంగంలో 16 సం.గా సేవలు అందిస్తున్నామని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్ కె హరీష్‌రెడ్డి, రోషిరెడ్డి, సంస్థ ప్రతినిధులు, తదితరు లు పాల్గొన్నారు.

# వాడవాడలా బిఆర్‌ఎస్ ఆవిష్కరణ వేడుకలు

**ప్రజాపక్షం/కాప్రా/మల్కాజిగిరి :** బిఆర్‌ఎస్ జెండా పండుగ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా వాడవాడలా పండుగలా కొనసాగింది. తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్య మ సంస్థగా ఆవిర్భవించిన బిఆర్‌ఎస్ పార్టీ లక్ష్యాన్ని సాధించిన అనంతరం రూపాంతరం చెంది 26 వసంతాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధుల్లో బిఆర్‌ఎస్ శ్రేణులు ఆయా ప్రాంత కూడళ్లు, పార్టీ కార్యాలయాలు, ప్రజా ప్రతినిధుల కార్యాలయాల వద్ద పార్టీ పతాకాలను ఆవిష్కరిం చి పటాకులు కాల్చటం, స్వీట్లు పంచిపెట్టుకోవటం ద్వారా సంబురాలు జరుపుకొన్నారు. జై తెలంగాణా, జై కెసిఆర్ నినాదాలలో హోరెత్తించారు.

**మల్లాపూర్‌లో...** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్‌లో నిర్వహించిన జెండా స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పార్టీ పతాకాన్ని ఎగురవేసారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర సాధన అనంతరం పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ శ్రేణు లు శ్రీనివాస్ గౌడ్, కుంటి కృష్ణ, మల్లేష్, ఉస్మాన్, దయాకర్‌రెడ్డి, గణేష్, రాజేష్, రఘువరన్, కృష్ణగౌడ్, శ్రవణ్, రిజ్వాన్,తదితరులు పాల్గొన్నారు.

**మౌలాలిలో...** మౌలాలి ప్రధాన చౌరాస్తాలో మహ్మద్ ఉస్మాన్ ఆధ్వర్యంలో జరిగిన బిఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకల్లో పార్టీ సీనియర్ నేత బద్దం పరశురాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ మురుగేష్, తదితరులు పాల్గొన్నారు.

**జవహర్ నగర్‌లో:** ప్రజల గుండెల్లో చిరస్థాయిగా బీఆర్‌ఎస్ పార్టీనిలుస్తుందని, మాజీ సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా ఖ్యాతిగాంచాయని బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జవహర్ నగర్ పరిధిలో బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండ ల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిర్భావ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.














## మేడే ఉత్సవాలు విజయవంతం చేయండి : ఎఐటియుసి పిలుపు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అవిర్భవించిన మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి రంగారెడ్డి ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా అధ్యక్షులు రమావత్ సక్రు నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం ఎల్‌బి నగర్ చౌరస్తాలో మేడే ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే ఉత్సవాలను కార్మికులు భారీగా పాల్గొని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బాతరాజు నరసింహ, బీరప్ప, జంగయ్య, శంకర్, మల్లన్న, సుమన్, సంపత్, అశోక్, గణేష్, సుధాకర్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోతలు లేకుండా విద్యుత్ అందించాలన్నదే లక్ష్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొందుర్గు:** రైతులకు, ప్రజలకు కోతలు లేకుండా విద్యుత్ అంధించాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం కొందుర్గు మండల పరిధిలోని శ్రీరంగాపూర్ సబ్ స్టేషన్‌లో కొనసాగుతున్న 50ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఇన్స్టాలేషన్ పనుల పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఓవర్‌లోడ్ సమస్యను నియంత్రించేందుకే విద్యుత్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసి కొత్తగా 50 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నాణ్యమైన విద్యుత్ అంధించాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. రామచంద్రపురం..మహదేవ్‌పూర్ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, భైరంపల్లి..ఉత్తరాస్‌పల్లి రహదారిపై హైవల్ బ్రిడ్జి నిర్మాణానికి, ఉత్తరాస్‌పల్లి..ముట్పూర్ రహదారిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఇ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు సయ్యద్ సాధిక్, కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, మంగులాల్‌నాయక్, సర్పంచ్ రమేష్, కేకు కృష్ణ, గోవర్ధన్‌రెడ్డిలు ఉన్నారు.

## స్వీయ జనగణనపై అవగాహన



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** స్వీయ జనగణన–2027 నమోదుపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూపర్‌వైజర్ పాతూరి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వీయ జనగణన వివరాలు నమోదుపై పాలక వర్గానికి అవగాహన కల్పించారు. అనంతరం పాతూరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో 100శాతం జనగణన పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుండ్ల కొండల్ గౌడ్, ఉప సర్పంచ్ కె వెంకటేష్, గ్రామ కార్యదర్శి రాధ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం మార్కెటు కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి అన్నారు. సోమవారం యాచారం, చింతపట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని చెప్పారు. ప్రభుత్వం క్వింటాల్ ఎ గ్రేడ్‌కు 2389 రూపాయలు, సాధారణ రకాల వడ్లకు క్విటాలుకు 2369 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు.సన్న వడ్లకు అదనంగా 500 రూపాయలు బోనస్ క్వింటాలుకు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం రవీందర్, వ్యవసాయధికారి అర్.రవినాథ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అక్బర్, ఐకెపి సిబ్బంది. సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## మొండిగౌరేల్లి గ్రామంలో భూసర్వే అడ్డుకున్న రైతులు



**ప్రజాపక్షం/యాచారం :** మొండిగౌరెల్లి గ్రామంలో ప్రభుత్వం టిజి ఐఐసి ద్వారా సేకరిస్తున్న భూముల సర్వేలో సాగు భూములకు నష్టపరిహారం పెంచాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న భూములకు ఎకరాకి 40లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగుకు యోగ్యంగా లేని రాళ్ళు రప్పలు, నల్లటి గుట్టలు ఉన్న భూములకు 30 లక్షలే, సాగుకు యోగ్యంగా ఉన్న భూములకు 30 లక్షల రూపాయలు ఇవ్వడం ఎంతవరకు సమంజస మన్నారు. కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ సాగు భూములకు నష్టపరిహారం పెంచి ఇచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బండిమీది కృష్ణ, రైతులు ఎట్టి లక్ష్మయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ప్రతిరోజూ రోడ్లపై వ్యర్థాలు తొలగింపు



ఎంఎంసి కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, దోమల నివారణే లక్ష్యంగా పనిచేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. తార్నాక, స్నేహపురి కాలనీ, మౌలాలి ప్రాంతాల్లో సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. రోడ్ల పక్కన పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలను, గ్రీన్ వేస్ట్‌ను వెంటనే తొలగించాలని సూచించారు. ఎన్ఎఫ్‌సి సర్కిల్ వద్ద జరుగుతున్న రహదారి విస్తరణ పనులను గడువులోగా పూర్తి చేయాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు.

### 'స్వయం సహాయక సంఘాల' స్టాళ్లు

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహమిచ్చేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి స్టాళ్లను ఏర్పాటు చేశారు. కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి వీటిని సందర్శించి మహిళలను అభినందించారు. స్థానికంగా తయారైన వస్తువులకు గుర్తింపునివ్వడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని ఆయన తెలిపారు.

### ప్రజావాణిలో సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 27 వినతులు అందాయి.



## మే 5లోగా మ్యాపింగ్ పూర్తిచేయాలి

జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రతి బిఎల్‌ఓ రోజుకు 100 మంది ఓటర్లను, సూపర్‌వైజర్ 1000 మంది ఓటర్లను మ్యాపింగ్ చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. మే 5వ తేదీలోపు ఈ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## జిహెచ్‌ఎంసిలో 87 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 87 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (అడ్మిన్) కె. సత్యనారాయణ, డైరెక్టర్ (యుబిడి) వి.వెంకటేశ్వరరావు, జాయింట్ కమిషనర్లు ఎస్. జయంత్ (అడ్మిన్), జి.రాజనీకాంత్ రెడ్డి (రెవెన్యూ), అదనపు చీఫ్‌సిటీ ప్లానర్ ఉమాదేవి పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అధికారులు ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును స్వీకరించి, సంబంధిత విభాగాలకు పంపించి త్వరిత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులలో ప్రధానంగా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్యానికి సంబంధించిన అంశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నగర పౌరుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం ఈ ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు పునరుద్ఘాటించారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు వేగంగా పరిష్కారం

సిఎంసి కమిషనర్ సృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పౌరుల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ సృజన ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అందిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, రసీదు జారీ చేయడంతో పాటు, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించే విధానం అమల్లో ఉందని అధికారులు తెలిపారు. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడి కేటాయించడం ద్వారా పౌరులు తమ సమస్య స్థితిని సులభంగా తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందినవి అత్యధికంగా 34 కాగా, ఇంజనీరింగ్ విభాగానికి 5, రెవెన్యూ, ఆస్తి పన్ను విభాగానికి 2 ఫిర్యాదులు వచ్చాయి. పారిశుద్ధ్యం, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యుసిడి), అడ్వర్టైజ్‌మెంట్ విభాగాలకు ఒక్కో ఫిర్యాదు చొప్పున అందాయి. ప్రతి ఫిర్యాదును సమీక్షించి, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఫిర్యాదు స్వీకరణ నుంచి పరిష్కారం వరకు ప్రతి దశలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎటువంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



### 'ప్రతిరోజూ ఒక వార్డు' తనిఖీ కార్యక్రమం ప్రారంభం

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ క్షేత్రస్థాయి పాలనను బలోపేతం చేసేందుకు 'ప్రతిరోజూ ఒక వార్డు' అనే నూతన కార్యక్రమాన్ని ఆర్.సి. పురం వార్డులో ప్రారంభించారు. రూ.15 కోట్లతో చేపట్టనున్న చెరువు అభివృద్ధి పనులను సమీక్షించారు. గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కాకతీయ నగర్ పార్కులో లైటింగ్, కమ్యూనిటీ హాల్ నిర్మాణ ప్రతిపాదనలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# గణనలో వివరాలు చెప్పండి





రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గణనలో గుర్తించబడిన ఉద్యోగులు సర్వే నిమిత్తం ఇంటికి వచ్చినపుడు మీ ఐడి వివరాలు తెలియపరచాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణ2027 కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రతిఒక్కరు స్వీయ గణనలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. స్వీయ గణన ఆన్ లైన్ పోర్టల్ (se.census.gov.in) వెబ్ సైట్‌ను సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడి పొందాలని, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరిగే గణనలో గుర్తించబడిన ఉద్యోగులు సర్వే నిమిత్తం ఇంటికి వచ్చినపుడు మీ ఐడి వివరాలు తెలియపరచాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సెన్సస్ ఇంచార్జి అధికారి శిరీష పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ( రెవెన్యూ), కిరణ్మయి కొప్పిశెట్టి (లోకల్ బాడీస్) జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,వివిధ శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరత లేదు

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలకు నమ్మకం కలిగించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సేల్స్ ఆఫీసర్లకు సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లాలో కొన్ని పెట్రోల్ బంకులలో పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నటువంటి పరిస్థితిపై జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా ఎనర్జీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతోపాటు పెట్రోల్ బంక్ డీలర్స్ తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్లు, పెట్రోల్ బంక్ డీలర్లు ఎక్కువ మొత్తంలో వినియోగదారులకు అమ్మకాలు జరపకుండా చూడాలని, అందరు వినియోగదారులు సాధారణ పద్ధతిలోని రోజువారి కొనుగోలు జరపాలని కోరారు. ఈ విషయాన్ని కంపెనీ ప్రతినిధులతో పాటు టెలి కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అధికారులు సాధారణ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వినియోగదారులు కూడా అనవసరంగా కొనుగోలు చేసి కృత్రిమ కొరతకు కారణం కారాదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, సేల్స్ ఆఫీసర్లు మాట్లాడుతూ ప్రజలు అనవసర భయాందోళనలకు గురై ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడం వలన కృత్రిమ కొరత ఏర్పడిందని తెలిపారు. పెట్రోల్ బంకులు యజమానులు మాట్లాడుతూ ఆయిల్ కంపెనీలు కొంత సరఫరా పెంచితే ఇబ్బంది ఉండదని తెలిపారు.

**బంకులు పరిశీలించిన డిసిఎస్ఓ వనజాత**

రంగారెడ్డి జిల్లా లోని పలు ప్రాంతాల్లో పెట్రోల్,డీజిల్ కొరత,నాణ్యత, స్టాక్ రికార్డులను డిసిఎస్ఓ వనజాత,ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.



# ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను సోమవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సిఐ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, మధు గౌడ్, లగ్గొని శ్రీధర్‌గౌడ్, సంజయ్‌కుమార్, పీవి నర్సింహా రావు, అజయ్ యాదవ్, కరుణాకర్‌రెడ్డి, అంజన్న, వెన్నెల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

**బియన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో...** బిఆర్ఎస్ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను బియన్‌రెడ్డి నగర్ డివిజన్ ఎస్‌కెడి నగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్ చౌదరి, ముద్దగౌని సతీష్‌కుమార్ గౌడ్, సందడి సందీప్‌రెడ్డి, శివశంకర్, మందడి సందీప్‌రెడ్డి, రాఘవేంద్ర రావు, అర్జున్ గౌడ్, నిర్మల పాల్గొన్నారు.

**హస్తినాపురం డివిజన్‌లో...** హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు ఆందోజు సత్యంచారి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్



రమావత్ పద్మ శ్రీనివాస్ నాయక్, నాగిరెడ్డి, రెడ్డిమాల కృష్ణ, రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్:** తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు కెసిఆర్‌ను ప్రజలు మర్చిపోరని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని బిఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రాజావరప్రసాద్, వి.నారాయణరెడ్డి, రాంబాల్‌నాయక్, ఆకుల శ్రీశైలం, చేగూరి వేణుగోపాల్, లక్ష్మణ్‌నాయక్, రాజ్యలక్ష్మి , మన్నె కవిత నారాయణ, వెంకటిరెడ్డి, ఈట గణేష్, ఎంఎస్ నటరాజన్, లక్ష్మీ నర్సింహ్మ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



**ఇబ్రహీంపట్నం:** బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, సుదర్శన్‌రెడ్డి, సత్తు వెంకటరమణా రెడ్డి, కర్నాటి రమేష్ గౌడ్, సిఎచ్ బుగ్గరాములు, జెర్కోని రాజు, సిఎచ్ రవీందర్ పాలొన్నారు.

**శేరిలింగంపల్లి :** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవ దినోత్సవాన్ని గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా బిఆర్ఎస్ జెండా ఎగురవేశారు.



కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాగం జంగయ్య యాదవ్, దార్గుపల్లి సరేష్, అంజమ్మ, రమేష్ గౌడ్, నారయణ, రాజు ముదిరాజ్, శామ్లేట్ శ్రీనివాస పరమేష్, అశోక్ యాదవ్, నారయన, అనిల్ సింగ్, మధు, వెంకట్ రెడ్డి, సురేష్, మాధవి, తహార్, ఖాదర్ ఖాన్ పాల్గొన్నారు.

**మాదాపూర్ డివిజన్ పరిధిలో..**మాదాపూర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ అధ్వర్యంలో మాదాపేర్‌లోని లెబర్ అడ్డా వద్ద బిఆర్ఎస్ జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు భిక్షపతి ముదిరాజ్, నర్సింగ్‌రావు, నర్సింహ, వినోద్ రెడ్డి, బాలరాజు, లక్ష్మణ్, నవీన్, వసంత్, సలీమ్, భరత్, రాజు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.









## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**ప్రజాపక్షం/నర్వ:** మక్తల్ నియోజకవర్గం నర్వ మండలంలోని జక్కన్నపల్లి గ్రామంలోని జెపిఎల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్ చేతుల మీదుగా ప్రారంభించి గ్రామ యువకులకి క్రికెట్ కిట్టు అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ యువకులు క్రీడల్లో , గ్రామ అభివృద్ధిలో ముందుండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎమ్‌సి వైస్ చైర్మన్ డి కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదిరెడ్డి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, పి. అశోక్ గౌడ్, ఎఎమ్‌సి డైరెక్టర్ మార్కా నరేష్, గ్రామ ఉప సర్పంచ్ వాకిటి నరసింహ నర్వ మండల కాంగ్రెస్ నాయకులు, రామన్ గౌడ్ వెంకటరామిరెడ్డి, లక్ష్మ ణ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## 24 గొర్రెలు చోరీ, కేసు నమోదు

**ప్రజాపక్షం/మాగనూరు:** మండల పరిధిలోని వడ్వట్ గ్రామ శివార్లలో ఆదివారం అర్ధరాత్రి గొర్రెల మందపై దుండగులు దాడి చేసి 24 గొర్రెలను అపహరించుకుపోయారు. అమ్మపల్లి గ్రామానికి చెందిన దూలపొల్ల సాబన్న, తన 250 గొర్రెలు, తన బంధువులైన శివప్పకు చెందిన 100 గొర్రెలు, మరో సాబన్నకు చెందిన 70 గొర్రెలను కలిపి మొత్తం మందను వాడ్వాట్ గ్రామ శివారులోని దేవాల మైపాల్‌రెడ్డి పొలంలో ఆదివారం సాయంత్రం మేపేందుకు ఉంచారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో గొర్రెలు అరుపులు విని యజమానులు లేచి చూసేవరకు అప్పటికే దొంగలు పరారయ్యారు. ఈ ఘటనలో సాబన్నకు చెందిన 15, శివప్పకు చెందిన 5, మరో సాబన్నకు చెందిన 4 గొర్రెలు, చోరీకి గురయ్యాయి. దూలపోలా సాబన్న ఫిర్యాదుతో మాగనూర్ ఏఎస్ఐ ఎస్.కె.మన్నన్ క్రైమ్, నెంబర్ 65/2026, సెక్షన్303(2) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గొర్రెల దొంగలను త్వరలోనే పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని పోలీసులు తెలిపారు.

## ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజానికి మార్గదర్శకాలు: రాఘవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ కలకుర్తి :** ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజానికి మార్గదర్శకాలని, భక్తులకు సౌకర్యాలు కల్పించే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం, ప్రజలకు అవసరమైన చోట సేవ చేయడమే తన లక్ష్యమని, ఇలాంటి దైవ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తన వంతు తోడ్పాటును అందిస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుగ్రీవుడి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణ సమీపంలోని కైలాసగుట్టపై భక్తుల సౌకర్యార్థం అయ్యప్ప స్వాముల విరి రేకుల షెడ్ నిర్మాణానికి గతంలో ఇచ్చిన హామీ మేరకు షెడ్ నిర్మాణ ఖర్చు రూ. 92 వేల చెక్కును ధర్మశాస్త్ర భక్త బృంద సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజానికి మార్గదర్శకాలని, భక్తులకు సౌకర్యాలు కల్పించే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు అవసరమైన చోట సేవ చేయడమే తన లక్ష్యమని, ఇలాంటి దైవ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తన వంతు తోడ్పాటును అందిస్తానని తెలుపుతూ, అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరి పై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నానని తెలియజేశారు. ధర్మశాస్త్ర భక్త బృంద సభ్యులు మాట్లాడుతూ రేకుల షెడ్ నిర్మాణానికి సహకారం అందించాలని కోరిన వెంటనే స్పందించి, ఇచ్చిన మాట ప్రకారం రూ. 92 వేల ఆర్థిక సహాయం అందజేసిన సుంకిరెడ్డి పై స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని, భక్తుల అవసరాలను గుర్తించి నిర్మాణానికి సహకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మశాస్త్ర భక్త బృంద సభ్యులు శేఖర్ గౌడ్, మల్లేష్, శ్రీనివాసులు, చందు, రవి, రాజు, రవి సాగర్, హాఫీష్, వినయ్ పాల్గొన్నారు.

## జనగణన శిక్షణా తరగతుల సమయం మార్చాలని వినతి



**ప్రజాపక్షం/ కృష్ణ :** స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి నుండి ప్రారంభమైన '' జనగణన 2026–27'' శిక్షణా తరగతులు సమయాన్ని మార్చాలని మండల ఉపాధ్యాయులు తహసిల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఏప్రిల్ 27 నుండి 29 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో దాదాపు 25 మంది ఉపాధ్యాయులు సూపర్వైజర్లుగా, ఎన్యూమరేటర్లుగా పాల్గొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నందున, రోజంతా శిక్షణలో పాల్గొనడం వల్ల ఉపాధ్యాయులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. శిక్షణా తరగతులను ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే నిర్వహించాలని ఉపాధ్యాయ బృందం కోరారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ శ్రీనివాస్ కు రాతపూర్వకంగా విన్నవించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, ఉపాధ్యాయుల విన్నపాన్ని సానుకూలంగా పరిశీలించి తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాజ్, రాఘవేంద్ర, అజయ్, అమీన్ రెడ్డి, కళ్యాణి, కుర్షిదా, మీనా కుమారి, నరేందర్, రాజన్న, చంద్రశేఖర్, అర్జున్ , ఖాసీం, అనిల్, ఆకాంక్ష, మోహన్ గోపాల్, శ్రీనివాసులు, రేణుక, శాహీన్, సౌమ్య, హనుమాదాస్, రంగా రావు పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు రెండు కోడెలు మృతి



**ప్రజాపక్షం/దామరగిద్ద:** దామరగిద్ద మండలంలోని పిడంపల్లి గ్రామంలో పిడుగుపాటుకు రెండు కోడెల మృతి చెందాయి. పిడంపల్లి గ్రామ రైతు కావలి బిచ్చన్నకు చెందిన రెండు కమ్మ కోడెలు పిడుగుపాటుకు చనిపోవడంతో సుమారు లక్ష నలభై వేల రూపాయల నష్టపోవడం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై రైతు బిచ్చన్న గ్రామ కార్యదర్శి, సర్పంచ్, తాహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు.రైతు కుటుంబాన్ని ఆదుకొని రైతుకు నష్టపరిహారం అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా విద్యుత్ ప్రముఖ మహిపాల్ అధికారులను కోరారు.

## చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/ వంగూర్ :** శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి వంగూరు గేట్ సమీపంలోని బస్టాప్ వద్ద తుమ్మలపల్లి గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ఎంపీడీవో బ్రహ్మచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పై ఇబ్రహీం, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది భారతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో రైతే రాజు

మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/ పెద్దకొత్తపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ, రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పెద్దకొత్తపల్లి మండలం కేంద్రంలోని పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించొద్దని పిఏసిఎస్ కేంద్రాలలో మెరుగైన మద్దతు ధర లభిస్తుందని, రైతులందరూ ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న పంటను తరలించేందుకు లారీల కొరత నివారించాలని అధికారులను మంత్రి జూపల్లి ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దండు నరసింహ, మార్కెట్ వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు పిఏపిఎస్ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల తోటకు దుండగులు నిప్పు



**ప్రజాపక్షం/ఉట్కూర్:** ఉట్కూర్ మండలంలోని పెద్దపోర్ల గ్రామానికి చెందిన కటికే బాలేపేర్ నాటిన చెట్ల మొక్కల తోటలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు టించడంతో సుమారు 40 పండ్ల చెట్ల మొక్కలు దహనమయ్యాయి. ఈ ఘటనపై గ్రామపంచాయతీ కార్యదర్శి రాఖీ దృష్టికి తీసుకెళ్లగా, సోమవారం ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా బిజెపి మాజీ బూత్ అధ్యక్షులు బోయిన్‌పల్లి నరేష్ కుమార్ మాట్లాడుతూ నష్టపోయిన రైతుకు వెంటనే నష్టపరిహారం అందించి, ప్రభుత్వం తరపున పూర్తి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## సంకల్పం ఉంటే సాధించనిదంటూ ఏదీ లేదు

జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** సంకల్పం ఉంటే సాధించనిదంటే ఏదీ లేదని జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మిషన్ వాత్సల్య (పథకం) కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చిన్న చిన్న కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లు దేశంలో అత్యున్నత పదవులు పొందారని, విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కష్టపడి చదివితే మీరు కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. సంకల్పం తీసుకున్నాక ఏ రోజు ఏం చేయాలనే ఆలోచనలతో ముందుకు వెళ్లాలని సూచించారు. చదువును అశ్రద్ధ చేయవద్దని తెలిపారు. బాల సదనం, చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ విద్యార్థులతో మాట్లాడి భవిష్యత్తులో ఎవరెవరు ఏం అవుతారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనాథ పిల్లలకు డీసీపీయూ స్టాఫ్ సహాయంతో తీసుకువచ్చిన జనన ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, కుల ధృవీకరణ, బ్యాంకు ఖాతా పత్రాలను, చిల్డ్రన్ హోమ్ పిల్లలకు హెల్త్ ఇన్సూరెన్స్ (ఎబిహెచ్ఎ) కార్డ్స్ ని కలెక్టర్ ప్రియాంక పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ / డీడబ్ల్యుఓ రాజేందర్ గౌడ్, జిల్లా అధికారులు, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి కరిష్మా, చైల్డ్ వెల్ఫేర్ అధికారి నర్సిములు, డీసీపీయూ, చైల్డ్ హెల్ప్ లైన్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి:** రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి మార్కెట్ యార్డు నందు మెప్మా (మహిళా సంఘం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చిన్నారెడ్డి మాట్లాడుతూ రైతులకు వెన్నుదన్నుగా ప్రజా ప్రభుత్వం ఉందన్నారు. గత ప్రభుత్వ పాలకులు వరి వేస్తే ఉరే అని రైతులను భయభ్రాంతులకు గురి చేశారని, కానీ నేడు తమ ప్రభుత్వం రైతులు వరి పండించేలా అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని ఆయన తెలిపారు. సన్నవడ్లకు క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతులు తాము పండించిన ప్రతి గింజను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని ఆయన సూచించారు. కొనుగోలు పూర్తయిన ఒకటి రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికాలను, నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ అధికారులు, జిల్లా ఎఐపిసి అధ్యక్షుడు నాగార్జున, వనపర్తి మండల ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజు, సీనియర్ నాయకులు నందిమల్ల రామ్ , ఇతర నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

102 దరఖాస్తుల స్వీకరణ




**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** ప్రజావాణిలో అర్జిదారుల నుండి స్వీకరించిన దరఖాస్తులను ఆలస్యం చేయకుండా సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయం సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను సావధానంగా విన్నారు. వారి సమస్యలను పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. అధికారులను నిర్దేశిస్తూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణిలో పంచాయితీ రాజ్, మున్సిపల్ శాఖ, జిల్లా సంక్షేమం, భూసర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, బ్యాంకింగ్, పోలీస్, విద్య, వైద్యం, గ్రామీణ అభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 102 వినతులను అధికారులు నమోదు చేసుకున్నారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా అధికారులతో సమావేశమై, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు బాలల భద్రత, డ్రగ్స్ నిరోధం పై విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అలాగే, మే 4 నుండి 9 వరకు వ్యవసాయ శాఖ ద్వారా రైతు వారోత్సవం నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయ అవగాహన వారంలో చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి చిన్న శాఖల అధికారులు రోజు వారీ షెడ్యూల్‌ను సవివరంగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**మే 2న నియోజకవర్గ సమా-వేశాలు**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మూడో దశ మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ఆయా నియోజకవర్గాలలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో సిద్ధంగా ఉండాలని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి సమావేశాలు నిర్వహించాలని అన్నారు. కలెక్టర్ ఛాంబర్లో జిల్లా సంక్షేమ శాఖ ద్వారా బాలల భద్రత, మత్తు పదార్థాల నిరోధంపై రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్. బి హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి రామ్ రెడ్డి, ఆర్.డి.ఓ నవీన్, జెడ్.పి.సి.ఈ.ఓ ఇంచార్జీ డి.పి.ఓ వెంకట్ రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, వివిధ శాఖ జిల్లా అధికారులు, అర్జిదారులు, తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చూడాలి**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి సాండ్ కమిటీ (డిఎల్ఎస్‌సి) సమావేశం నిర్వహించారు. హన్వాడ మండల తహసీల్దార్ ప్రతిపాదన మేరకు కమిటీ సభ్యులతో చర్చించి మండలంలోని మునిమోక్షం, గుండ్యాల్, వేపూర్ మూడు ఇసుక రీచ్‌ల నుండి ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ నిర్మాణ పనుల కొరకు ఇసుక సరఫరా చేయుటకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియ, జెడ్.పి.సి.ఈ.ఓ వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ ఎ.డి గోవిందరాజులు, ఆర్.డబ్ల్యు.ఎస్.ఈ.ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ ఈ.ఈ వెంకటయ్య, అధికారులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా జనగణన

అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** జనగణన ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాల్సిన అవసరం ఉందని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. జనగణనలో ప్రతిపౌరుడు స్వచ్ఛందంగా పాల్గొని, సరైన వివరాలను అందించడం ద్వారా ప్రభుత్వానికి సమగ్ర సమాచారం అందేలా సహకరించాలని ఆయన కోరారు. వీపనగండ్ల మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జనగణన రెండో విడత శిక్షణ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొంటున్న సిబ్బందితో మాట్లాడి, వారికి అవసరమైన మార్గదర్శకాలు అందించారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించే సమయంలో ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి విశ్వాసాన్ని పొందాలని ఆయన అన్నారు. సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడుతోందని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అలాగే, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు. జనగణన ద్వారా లభించే డేటా ఆధారంగా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన వివరించారు. అందువల్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి, తమ విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఖాజా మైనోద్దీన్ పాల్గొన్నారు.

**ఇసుక రీచ్ పరిశీలన**

మండల పరిధిలోని తూముకుంట ఇసుక రీచ్ ను జిల్లా అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. జిల్లాలోని మైనింగ్ ఇరిగేషన్ అధికారులతో తూముకుంట వాగులో ఇసుక లభ్యతపై చర్చించిన తర్వాతనే ఒక నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## జడ్చర్ల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు ఉద్యమం ఆపం

**ప్రజాపక్షం/జడ్చర్ల:** రెవెన్యూ డివిజన్ సాధన సమితి కో ఆర్డినేటర్లు డాక్టర్ వడ్త్యావత్ రమేష్ నాయక్, బూర్గుపల్లి కృష్ణ యాదవ్, మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో డాక్టర్ వడ్త్యావత్ రమేష్ నాయక్, బూర్గుపల్లి కృష్ణ యాదవ్ లు మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్ చేయాలి. అలాగే నవాబ్ పేట్ మండల కేంద్రంలోని కొల్లూర్ గ్రామాన్ని మండలం గా ఏర్పాటు చేయాలి, జడ్చర్ల మండలాన్ని రూరల్, అర్బన్ మండలాలు గా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జడ్చర్ల నియోజకవర్గం ప్రజలు చిరకాల ఆకాంక్ష అయిన జడ్చర్ల నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పై పలు దఫాలు గా ఉద్యమం చేపట్టడం జరిగిందని తెలిపారు. గత సంవత్సరం అసెంబ్లీ సమావేశంలో ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి జడ్చర్ల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై చర్చించడంతో ప్రస్తుత రెవెన్యూ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా సాధ్య సాధ్యాలను పరిశీలించి జడ్చర్ల రెవిన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ నేటి వరకు కార్యచరణ రూపొందించకపోవడం వల్ల రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమం మొదలు పెడుతున్నామని ప్రస్తుత అసెంబ్లీ సమావేశంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నేను యెడల అసెంబ్లీ ముట్టడికి సిద్ధమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, గోపాల్, అఫ్సర్‌లు పాల్గొన్నారు.

## తెలంగాణ అస్థిత్వానికి ప్రతీక బిఆర్ఎస్

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



**ప్రజాపక్షం/మక్తల్:** తెలంగాణ రాష్ట్ర అస్థిత్వానికి ప్రతిక బిఆర్ఎస్ పార్టీ అని మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జెండా కార్యక్రమాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పాటు ఆయన పార్టీ ప్రజాస్వామ్యపద్ధతిలో పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన అనంతరం పదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి చే సిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీ పాలనకు నిదర్శనం అన్నారు. రైతులు పడతున్న ఇబ్బందులు, మహిళలు సమస్యల పట్ల ప్రజలకు ఎప్పటికప్పుడు ప్రతి కర్త కార్యకర్త తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్ పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త శ్రీనివాస్ గుప్తా రాజుల ఆసి రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి మాజీ కౌన్సిలర్లు అన్వర్ హుస్సేను జగ్గలి రాములు ఎరకాలి మొగిలిలఅప్ప గుర్లపల్లి సర్పంచ్ గాలి రెడ్డి మాజీ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, గుర్లపల్లి సర్పంచ్ గాలి రెడ్డి, ఉప్పరి రఘు, ఈబుద్ధి మారెప్ప తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిజెపికి చెందిన పదిమంది కార్యకర్తలు బిఆర్ఎస్ లో చేరారు.

# స్వీయ జనగణనలో అందరూ పాల్గొనాలి

మీడియా ప్రతినిధులు స్వీయ గణన చేసి జిల్లా ప్రజలకు ఆదర్శంగా నిలవాలి

స్వీయ జనగణనకు మే 10 తుది గడువు

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**ప్రజాపక్షం/ నాగర్ కర్నూల్ :** స్వీయ గణనపై ప్రత్యేక మీడియా సమావేశాన్ని నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ హేమంతత్ కేశవ్ పాటిల్ సోమవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సుజాత లతో కలిసి నిర్వహించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ప్రెస్ మీట్‌లో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ... జిల్లాలోని 20 మండలాలు 460 గ్రామాల్లో నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 86 వార్డుల్లో జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెల్లడించారు. 2011 సంవత్సరం తర్వాత 2021 లో నిర్వహించాల్సిన జనాభా గణన కరోనా కారణంగా నిలిచిపోయిందని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సెన్సస్ 2027 ను ప్రారంభించాయని తెలిపారు. మొదటిసారిగా జనాభా గణన డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోందని చెప్పారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరుగుతున్న మొదటి దశ స్వీయ గణన ప్రక్రియలో ప్రజలు 100 శాతం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు సెన్సస్ పోర్టల్ లో కంప్యూటర్, మొబైల్, టాబ్ ద్వారా తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలని వచ్చిన ఒటిపి ఎంటర్ చేసి వెరిఫై అండ్ ప్రొసీడ్ క్లిక్ చేయండి. తరువాత మీకు నచ్చిన భాషను ఎంచుకోవాలని, మీ జిల్లా, పట్టణం / గ్రామం, పిన్ కోడ్ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మొబైల్ లో లోకేషన్ ఆన్ చేసి, మీ ఇంటి వద్ద రెడ్ మార్క్ సెట్ చేయాలని, ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, ప్రీవ్యూ ద్వారా చెక్ చేసి సబ్‌మీట్ చేయాలని సూచించారు. సబ్‌మీట్ చేసిన తరువాత హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల ఎస్ఈ ఐడి వస్తుంది. దాన్ని స్క్రీన్ షాట్ లేదా నోట్ చేసుకుని భద్రపరచుకోవాలని తెలిపారు మే 11 తరువాత మీ ఇంటికి వచ్చే గణన అధికారికి ఈ ఎస్ఈ ఐడి చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారన్నారు. స్వయంగా నమోదు చేసి సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. మే 10 వరకు జిల్లాలో స్వీయ గణన కార్యక్రమం కొనసాగుతుందని ఇందులో జిల్లాలోని ప్రతి ఒక్కరూ పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్ ఉన్నారు.

